ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

ఆదివారం 5 అక్టోబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0

వివాహేతర సంబంధానికి నిండు ప్రాణం బలి

■ లోపలి పేజీలో..

రిజిస్ట్రేషన్ల ఆదాయం భేష్

» ఆరు నెలల కాలానికి 9.1 శాతం వృద్ధి

» ఇప్పటికే రూ.176.98 కోట్లు ఆదాయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్లకు దసరా సీజన్ జోష్ తీసుకొచ్చింది. గతేడాదితో పోల్చుకుంటే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 9.1 శాతం వృద్ధి చెందింది. గత వారం నుంచి రిజిస్ట్రేషన్లు పెద్ద సంఖ్యలో సాగుతున్నాయి. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు, మరో 11 చోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సగటున రోజుకు 300 నుంచి 350 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సగటును 76కు పైగా భూముల క్రయ,విక్రయాలను కక్షిదారులు చేయించుకుంటున్నారు. కార్డు 2.0 సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో ఎటువంటి సమస్యలు లేకుండా పబ్లిక్ డేటా ఎంట్రీ అంతా కక్షిదారులే బయట చేసుకుని స్లాట్ బుక్ చేసుకుని, మరుసటి రోజు నిర్దేశిత సమయానికి వస్తే.. రిజిస్ట్రార్లు, కిందిస్థాయి సిబ్బంది మిగిలిన ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. మరోవైపు ఏలూరు జిల్లా కేంద్రంలోనే ఆగస్టు నుంచి అర్బన్ మ్యుటేషన్లు అందుబాటులోకి రావడంతో రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల వ్యవసాయ రిజిస్ట్రేషన్లు



చేయించుకున్న గంటల వ్యవధిలోనే డాక్యుమెంట్లు తీసుకునే వెసులుబాటు కలగడంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

జిల్లాలో పెరిగిన దూకుడు

జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల సులభతరంగా జరిగేలా స్లాట్‌తో పాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్లశాఖ రికార్డుల అప్‌డేటేషన్ వల్ల రిజిస్ట్రేషన్ల దూకుడు పెరిగింది. జిల్లాలో 2024 ఏప్రిల్ (మిగతా 8వ పేజీలో)

సరస్వతీదేవిగా చినవెంకన్న



చిన వెంకన్న కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.



పోలవరం జంటగుహల్లో లైనింగ్ పనులు

శరవేగంగా జంట గుహల పనులు

» 2026 జూన్ లక్ష్యంగా అధికారుల పరుగులు

పోలవరం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీలో ప్రధానమైన జంట గుహల పనులు ఊపందుకున్నాయి. 2026 జూన్ నాటికి లక్ష్యంగా అధికారులు పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ప్రాజెక్టు ఎస్ఈ రామచంద్రారావు నిరంతర పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో ఈ జంట గుహలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో తోటగొంది మామిడిగొంది గుహల మధ్య భాగంలో గుహలు కూలి అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో పరిస్థితులు మెరుగుపరిచి గుహల వెడల్పు పెంచి పనుల్లో వేగం పెంచారు. ఇప్పటికే ప్యాకేజి నెం 64 లో జంటగుహలలో మట్టి రాతి తరలింపు పనులు 80 శాతం పూర్తి కాగా కుడి టన్నెల్‌లో బెడ్ లైనింగ్ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఎగ్జిట్ ఎంట్రీ ఛానల్ పనులు 85 శాతం పూర్తయ్యాయి. తోటగొంది బండ్ 1 కాంక్రీటు పనులు కొనసాగుతున్నాయి. బండ్ 2 పనులు ఇటీవల పూర్తయ్యాయి. 62 ప్యాకేజీలో శాడిల్ డ్యాం ఇ, ఎఫ్, ఆఫ్ టేక్ రెగ్యులేటర్ పనులు పూర్తయ్యాయి. 63 ప్యాకేజీలో దేవరగొంది మామిడిగొంది టన్నెల్‌లలో టన్నెల్ వెడల్పు పనులు మట్టి రాతి పనులు పూర్తికాగా లైనింగ్ పనులు గాంట్రీ పనులు కొనసాగుతున్నాయి. ఎంట్రీ ఎగ్జిట్ ఛానల్‌లలో మట్టి రాతి పనులు పూర్తి కాగా ప్రస్తుతం గుహలలో పైభాగంలో కాంక్రీట్ వేసే గాంట్రీ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. గాంట్రీ పనుల కోసం గుహల పైభాగంలో కాంక్రీటు వేసే 4 యంత్రాలు కాంక్రీటు పనులు చేస్తుండగా మరో రెండు యంత్రాలను దిగుమతి చేసి పనులు మరింత వేగవంతం చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న దానికంటే గుహల్ని మరింత వెడల్పు లోతుగా తవ్వి గుహలు పటిష్టంగా ఉండేందుకు లైనింగ్ గాంట్రీ పనులు చేస్తున్నారు. గుహలు వెడల్పు లోతు పెంచడం వల్ల గ్రావిటీ ద్వారా కుడి కాలువకు నీరందించడానికి పూర్తి వెసులుబాటు ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు 2026 నాటికి పనులు నూటికి నూరుశాతం పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేశామని, నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని ఎస్ఈ రామచంద్రరావు తెలిపారు.



జంట గుహల్లో మట్టి తరలింపు పనులు

ఆటో డ్రైవర్లకు అండగా..

టాప్-5లో ఏలూరు జిల్లాను నిలుపుతాం

'ఆటో డ్రైవర్ల సేవలో' సభలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచింది. గత దీపావళికి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయగా.. ఇప్పుడు దీపావళికి ముందుగానే ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాం. ఆటోలపై విధించే అపరాధ రుసుం తగ్గించేలా సీఎం దృష్టికి వివరిస్తా' అంటూ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏలూరు కోటదిబ్బ జూనియర్ కళాశాల ఆవరణలో 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా ఆటోడ్రైవర్లకు రూ.15వేల ఆర్థికసాయం జమ చేసేందుకు చెక్కును లబ్ధిదారులకు శనివారం ఆయన అందజేశారు. ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ 'అభివృద్ధి.. సంక్షేమ పథకాల్లో రాజకీయాలకు అతీతంగా ఏలూరు జిల్లాను ముందంజలో నిలుపుతాం. ఈ విషయంలో వెనుకడుగు అనేది లేనే లేదు. ఏడాదిలోపే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏలూరు పోటీపడేలా చేసి టాప్-5లోకి చోటు కల్పించే దిశగా సర్వం సిద్ధం చేస్తున్నాం. గతేడాది 46 వేల కోట్లను సంక్షేమ పథకాలకు వెచ్చించాం. ప్రతీ నెల 2,712 కోట్ల పెన్షన్లు అందిస్తున్నాం' అని మంత్రి తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 10,655 మంది ఆటోడ్రైవర్లకు రూ.15కోట్ల 98లక్షల 25వేల ఆర్థిక సాయం జమ అవుతుందన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు కొత్త పథకం అమలు చేయడంలో ప్రభుత్వం ఘనత అనిర్వచనీయమన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, విజయవాడ జోనల్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో పాల్గొన్న 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని సభావేదిక వద్ద ప్రత్యక్ష ప్రసారం చేశారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీటీసీ షేక్ కరీమ్, ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ పంకజ్‌కుమార్, ఏలూరు మార్కెట్ యార్డు చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. కాగా తొలుత నగరంలో పలుచోట్ల నుంచి ఆటోడ్రైవర్లు వాహనాలతో ర్యాలీగా సభాప్రాంగణానికి కుటుంబ సమేతంగా చేరుకున్నారు. అగ్రహారం నుంచి ఆటోను ఎమ్మెల్యే బడేటి చంటి నడపగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆటోలో కూర్చుని సభా వేదికకు వచ్చారు. ఎమ్మెల్యే పూర్తిగా ఆటో వాలా డ్రెస్ ధరించగా మేయర్,ఇతర ప్రజాప్రతినిధులు ఖాకీ షర్టులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



ఏలూరు శనివారపుపేటలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు



ఆటోడ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి, మేయర్ నూర్జహాన్, విజయవాడ జోనల్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

మురిసిన ఆటో డ్రైవర్లు

రూ.15వేలు జమపై హర్షం

■ లోపలి పేజీలో..

టెట్ సెట్టవుతుందా..?!

» ఉపాధ్యాయ అర్హత పరీక్షపై ఇన్‌సర్వీస్ టీచర్లలో విస్తృత చర్చలు

» పరీక్ష తప్పనిసరైతే ఉమ్మడి జిల్లాలో 8 వేల మందికి పైగా టీచర్లపై ప్రభావం

» ప్రభుత్వం నుంచి సమాచారం లేదన్న డీఈవో



ఇన్‌సర్వీస్ టీచర్లు సైతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు... 2010వ సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన గురువుల్లో కలకలం రేపుతోంది. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు అధికారిక ప్రకటనేదీ లేకపోయినా గతంలో ఎన్సీఈఆర్టీ (జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి) జారీ చేసిన నోటిఫికేషన్, తాజాగా సుప్రీం తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష తప్పనిసరైతే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న 16 వేలకు మందికి పైగా టీచర్లలో కనీసం సగానికి పైగా టెట్‌కు ప్రిపేర్ కావడం, ఉత్తీర్ణత సాధించడం మినహా ప్రత్యామ్నాయం లేదని భావిస్తున్నారు. ఇప్పటికే దశాబ్దాల తరబడి తరగతి గదిలో బోధనా నుభవంతో వున్న టీచర్లు మళ్లీ ఇపుడు అర్హత పరీక్ష (టెట్) ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, మరి కొందరు కోర్టు తీర్పుపై న్యాయస్థానంలో అప్పీల్‌కు వెళ్లనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలపై ఉమ్మ డి జిల్లా డీఈవో వెంకట లక్ష్మమ్మను శనివారం వివరణ కోరగా... ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలన్న విషయం సామాజిక మాధ్యమాల ద్వారానే తనకు తెలిసిందని, దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారం లేదని స్పష్టం చేశారు.

ఏంటీ సమస్య..

ఉపాధ్యాయ విద్యకు సంబంధించి డీఎడ్, బీఎడ్ అర్హతలున్నప్పటికీ, ఉద్యోగ నియామకాలకు అర్హత పరీక్ష టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టులో ఎన్సీటీఈఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికనుగుణంగానే తదుపరి ఉపా ధ్యాయ నియామకాలన్నింటికీ టెట్‌ను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేప ట్టాయి. ఆ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2012 రిక్రూట్‌మెంట్ నుంచి టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ఆ తర్వాత 2014, 2018, తాజాగా మెగా డీఎస్సీ-2025 నియామకాలన్నీ టెట్ ఉత్తీర్ణులతోనే జరిగినందున వీరి విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదు. ఈ క్రమంలో గతంలో అంటే 2010కి ముందు ఉద్యోగంలో చేరిన టీచర్లు కూడా ఇపుడు టెట్ రాసి అర్హత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, ఆ మేరకు రెండేళ్లలోపే టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని నిబంధన విధించడం... ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమైంది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ఐదేళ్లకు పైబడి ఉద్యోగకాలం వున్న టీచర్లంతా రెండేళ్ల వ్యవధిలో టెట్ రాసి ఉత్తీర్ణులు కావాల్సిందే. అలా ఉత్తీర్ణత కాకపోతే ఉద్యోగంలో కొనసాగింపుపై టీచర్లలో డైలమా నెలకొంది.

ఒకవేళ టెట్ ఉత్తీర్ణత తప్పనిసరైతే...

150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉండే ఈ పరీక్షలో అర్హత సాధించడానికి ఓసీ కేటగిరీవారు 90 మార్కులు (60 శాతం), బీసీలు 75 మార్కులు (50శాతం), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 60 మార్కులు (40శాతం) సాధించాల్సి ఉంటుంది. ఎస్జీటీలైతే టెట్ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లయితే పేపర్-2 రాయాలి. ఏ కేడర్ టీచర్లయినా 2030వ సంవత్సరం సెప్టెంబరు 30వ తేదీలోగా (అంటే ఐదేళ్లలోపు) రిటైరయ్యేవారు మాత్రం టెట్ రాయ నవసరంలేదని చెబుతున్నారు. కానీ ఈ వ్యవధిలో ఉద్యోగోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఆ ప్రకారం ఐదేళ్లకు మించి (మిగతా 8వ పేజీలో)

9,10న కొత్త టీచర్ల పోస్టింగ్‌లపై కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 కొత్త టీచర్లకు పాఠశాలల్లో పోస్టింగ్‌లు కేటాయించేందుకు ఈనెల 9,10వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. డీఎస్సీకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల నుంచి మొత్తం 1,146 మంది ఉపాధ్యాయులు ఎంపికకాగా, వీరికి ప్రస్తుతం ఇండక్షన్ ట్రైనింగ్ క్యాంపును భీమవరం, తణుకు, నరసాపురంలలో నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ శిక్షణ శిబిరం ఈనెల 10న ముగియనుంది. ఈలోపు కొత్త టీచర్లకు పోస్టింగ్‌లను కేటాయించాల్సి ఉంది. మాన్యువల్ విధానంలో నిర్వహించే కౌన్సెలింగ్‌ను శిక్షణ ముగింపునకు రెండురోజుల ముందుగానే పూర్తి చేయడానికి ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా పాఠశాలలు, సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలను ఖరారు చేశారు. ఆ ప్రకారం కేటగిరీ-3,4లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను తొలుత భర్తీ చేయనున్నారు. ముఖ్యంగా జీరో టీచర్ స్కూల్స్‌కు కొత్త టీచర్లను కేటాయించడం ద్వారా ఉపాధ్యాయుడు లేని పాఠశాల ఉండకుండా తొలి ప్రాధాన్యం ఇస్తారు. కౌన్సెలింగ్ నిర్వహణ మార్గదర్శకాలు, ఏర్పాట్లపై సోమవారం అమరావతిలోని పాఠశాలవిద్య డైరెక్టరేట్‌లో నిర్వహించనున్న అన్ని జిల్లాల డీఈవోల సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నారు.



విజయవాడ ధర్నాలో పాల్గొన్న జిల్లా వైద్యులు

నేటి నుంచి వైద్యుల రిలే నిరాహార దీక్షలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటాను 30శాతానికి పెంచాలని, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అలవెన్సును ఇవ్వాలని, గిరిజనమండలాల్లో పనిచేసే వైద్యులకు ఏజెన్సీ అలవెన్సును చెల్లించాలని డిమాండ్‌చేస్తూ పీహెచ్‌సీల వైద్యులు కొద్ది రోజులుగా జరుపుతున్న సమ్మెలో భాగంగా శనివారం చలో విజయవాడ ధర్నాకు జిల్లా నుంచి మెడికల్ ఆఫీసర్లు తరలి వెళ్లారు. మొత్తం 120 మంది వైద్యాధికారులకు గాను 80 మంది చలో విజయవాడకు హాజరయ్యారని ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగా భవాని, డాక్టర్ జోషిమా తెలిపారు. విధులకు గైర్హాజరైన వైద్యులను ఉద్యోగంనుంచి తొలగిస్తామని ఉన్నతాధికారులు బెదిరింపులకు దిగుతున్నా భయపడేదిలేదని, ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లన్నీ పరిష్కారమైన తర్వాతే పీహెచ్‌సీలకు వెళ్తామని స్పష్టం చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ఆదివారం నుంచి చేపడుతున్న రిలే నిరాహారదీక్షలకు పోలీసుల అనుమతి లభించిందని వివరించారు. ఇదిలాఉండగా వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు విఘాతం కలుగకుండా ఏపీ వైద్యవిధానపరిషత్, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులను అవుట్ పేషెంట్లతాకిడి ఎక్కువగా ఉండే పీహెచ్‌సీలకు తాత్కాలికంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం సర్దుబాటు చేశారు. మిగతాచోట్ల పీహెచ్‌సీకి కనీసం ఒక్కరైనా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

కిల్కారీ సేవల అమలుపై సమీక్ష

గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేసేందుకు ఉద్దేశించిన కిల్కారీ సేవలు, ఇతర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా నోడల్ ఆఫీసర్లతో డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సమీక్షించారు. ఆశా/ ఏఎన్ఎంలు కిల్కారీ ఫోన్ కాల్స్‌పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే 13వ తేదీలోపు తెలపండి

ఏలూరు క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మెడికల్ కాలేజీ, ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 19 రకాల పోస్టులను భర్తీ చేయడానికి ఈ ఏడాది మే 30న ఇచ్చిన నోటిఫికేషన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రోజినల్ మెరిట్ లిస్టును పరిశీలించి ఆన్‌లైన్‌లో ఉంచినట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆధార పత్రాలతో ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వచ్చి సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం, ప్రొవిజినల్ మెరిట్ లిస్టును https://eluru.ap.gov.in, https://westgodavari.ap.gov.inలో పరిశీలన చేసుకోవాలని సూచించారు. నిర్ధేశించిన గడువులోపే అభ్యంతరాలు తెలపాలని, గడువు తేదీ ముగిసిన తరువాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముద్దాయిలకు శిక్షపడేలా సమర్థవంతంగా కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బంది విధులను నిర్వర్తించాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్లకు చెందిన కోర్టు మానిటరింగ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ కేసులు విచారణ వేగంగా జరగాలంటే సాక్ష్యులను సమయానికి కోర్టుకు హాజరు పర్చాలని సూచించారు. నేరస్తులు శిక్ష తప్పించుకోకూడదని బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు కోర్టులో జరిగే కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ అధికారికి తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, డీసీఆర్బీ ఎస్ఐ రామకృష్ణ, కోర్టు మానిటరింగ్‌సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేధస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్ పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేధస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేధస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా. తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?



టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.

నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్ కూడా చేయాలని ఉంది.

నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ


ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంద'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్ల చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.



పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10

రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...





దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగురంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్స్, సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.

సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్ల పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్ల నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.





టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబి, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

క్రీడా సమాచారం

7 నుంచి ఉమ్మడి పశ్చిమ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. 7వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో బాలికలకు చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాసన, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 8వ తేదీ పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బాలురకు చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాసన, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 14వ తేదీన ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో బాలురు, బాలికలకు బాస్కెట్‌బాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15వ తేదీ పెదవేగి గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు హేండ్‌బాల్, హాకీ, కేరమ్స్, రోల్‌బాల్ పోటీలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో సహా సకాలంలో హాజరుకావాలని సూచించారు.

6న ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల హైస్కూళ్లలో చదివే బాలబాలికలకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, కార్యదర్శి కె.అలివేలుమంగ ఓ ప్రకటనలో పేర్కొన్నారు తైక్వాండో, హ్యాండ్‌బాల్ క్రీడల్లో ఈనెల 6న ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని వివరించారు. బాలబాలికలు తాము చదువుతున్న పాఠశాల హెచ్‌ఎం సంతకంతో ఎంట్రీఫారంను సమర్పించాల్సి ఉంటుందన్నారు. క్రీడాదుస్తులు, వాటర్ బాటిల్స్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 90308 94311 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అక్టోబరు 5వ తేదీ పురస్కరించుకుని తెలుగురాష్ట్రాల్లో విద్యాబోధనతోపాటు, కల్చరల్, స్పోర్ట్స్, ఆర్ట్స్ యోగా విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తోన్న టీచర్లను గుర్తించి అవార్డులు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన టీచర్లు దరఖాస్తులు చేయాలని, ఎంపికైనవారికి ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అధ్యాప కులు, ఉపాధ్యాయులు తమ బోధన, శిక్షణ అనుభవాల పూర్తివివరాలు గల సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతోపాటు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుకు జతచేయాలన్నారు. ఈనెల 10వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపా లని కోరారు. వివరాలకు 96523 47207 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఏలూరులో స్కేటింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈనెల 6, 11, 12వ తేదీలలో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వెస్ట్ గోదావరి జిల్లా శాఖ కార్యదర్శి కేబీవీ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు నవంబరులో కాకినాడలో జరిగే 37వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని మరింత సమాచారానికి 98491 37037 నంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు



ఏలూరు రూరల్, అక్టోబరు 4, (ఆంధ్రజ్యోతి) : శనివారం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాష్ తెలిపారు. అరిగెల అరవింద్, నవీన్‌కుమార్ ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరిద్దరు నవంబరు 4న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థులను ఎంఈవో-2 అరుణ్‌కుమార్ శిక్షణ ఇచ్చిన పీడీ పద్మలతను అభినందించారు.



సూర్యప్రభ వాహనంపై వున్న స్వామి,అమ్మవార్లకు హారతిస్తున్న అర్చకులు

'సూర్యప్రభ'పై శ్రీవారి చిద్విలాసం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైఖానస ఆగమ యుక్తంగా నిర్వహించే ఆశ్వీయుజమాన దివ్య బ్రహ్మోత్సవాలు మూడో రోజు శనివారం వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సప్త అశ్వాలను అధిరోహించిన సూర్యభగవానుని వాహనంగా చేసుకుని.. తేజో విరాజితుడైన చిన్నతిరుమలేశుడు శనివారం ఉదయం క్షేత్రపురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారిని ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి హారతులిచ్చారు. పిల్లనగ్రోవి ధరించి చిన్నికృష్ణుని అలంకరణలో ఉన్న స్వామివారు చిరు మందహాసధారియై తన ఉత్సవ వైభవాన్ని వీక్షించే భక్తులకు అభయ హస్తంతో వరాలు కురిపిస్తున్నట్లుగా కనువిందు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదఘోషల నడుమ ఉభయదేవేరులతో చినవెంకన్న క్షేత్రపురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : ఉదయం 7 గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. రాత్రి 8-30గంటలకు వెండి శేషవాహనంపై తిరువీధిసేవ

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ ..

వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజనులతోను, భవానీ దీక్షాదారులతోను శనివారం కిటకిటలాడింది. విజయవాడలో దుర్గమ్మను దర్శించిన పలు ప్రాంతాలకు చెందిన వారంతా మార్గమధ్యలో ఉన్న శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. వేలాది మంది యాత్రికులు, భవానీ దీక్షాదారులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 20 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. దర్శనానంతరం వారంతా శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆకాశంలో.. సోయగం



కారు మబ్బులు | అరుణ కాంతులు

ప్రకృతి ఎంతో రమణీయమైంది. క్షణక్షణానికి తన రూపురేఖలను మార్చుకుంటూ చూపరులను మైమరపిస్తుంటుంది. ఓ వైపు కారు మబ్బులు కమ్ముకుంటుంటే మరో వైపు అరుణకాంతులతో ఆకాశం ప్రజ్వలంగా మారింది. ద్వారకాతిరుమలలో ఈ రమణీయ దృశ్యాలు శనివారం సాయంత్రం వేళ కనువిందు చేశాయి.

- ద్వారకాతిరుమల





ఏలూరులో ఆటో డ్రైవర్ల ర్యాలీలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ తదితరులు.. మెసేజ్‌లను చూపిస్తున్న ఆటో డ్రైవర్లు.. పాలకొల్లులో ఆటో డ్రైవర్ల ర్యాలీ

మురిసిన ఆటో డ్రైవర్లు

- రూ.15 వేల ఆర్థిక సాయం జమ కావడంతో ఆటో డ్రైవర్ల హర్షం

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. గత దీపావళికి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయగా.. ఇప్పుడు దీపావళికి ముందుగానే ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించి వారి మనసు గెలుచుకుంది. శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా రూ.15వేల ఆర్థిక సాయం అందించి మరో అడుగు ముందుకేసింది. ఈ పథకం ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలో 8,439 మంది, ఏలూరు జిల్లాలో 10,655 మంది ఆటో డ్రైవర్ల ఖాతాలకు ఆర్థిక సాయం జమ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆ మెస్సేజ్‌లను ఇతరులకు చూపించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆటో డ్రైవర్ల అభిప్రాయాలు ఇలా.. - న్యూస్ నెట్వర్క్

అనేక సమస్యలు తొలగించారు



ఆటో డ్రైవర్లకు గ్రీన్‌ట్యాక్స్ ఎత్తివేయడంతో పలు సమస్యలకు ప్రభుత్వంలో సత్వర నాయ్యం జరిగింది. ఇప్పుడు పెద్ద మనస్సుతో ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.15వేలను జమచేయడం మాకెంతో ఆనందంగా ఉంది.

- లీలాకృష, ఏలూరు టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఇది చాలా మంచి పథకం



ఆటో డ్రైవర్లకు, క్యాబ్, టాక్సీ డ్రైవర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం సంకల్పించడం శుభ పరిణామం. గత ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర కింద రూ.10వేలను జమచేసి, ఆ తర్వాత పలు ఇబ్బందులను సృష్టించారు. కూటమి ప్రభుత్వం రూ.15వేల ఆర్థిక సాయంతో ఆటోబాగు చేత, ఇతర వాటికి ఈ మొత్తం ఉపకరిస్తుంది.

- సూరిబాబు, ఆటోడ్రైవర్, ఏలూరు

మేనిఫెస్టోలో లేకున్నా..



ఎన్నికల మేనిఫేస్టోలో లేకున్నా ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15వేలు ప్రభుత్వం జమ చేయాలని నిర్ణయించడం హర్షణీయం. గత వైసీపీ హయాంలో రూ.10వేలు ఇచ్చినా ఆర్టీవోల జరిమానాలతో పాటు రోడ్ల గోతులతో వాహనాల మరమ్మతులకే సరిపోయేవి కావు. ప్రస్తుతం రోడ్లు బాగున్నాయి.

- పి.రాజేష్‌ఖన్నా, పాలకొల్లు

ప్రతి కుటుంబానికి ఆసరాగా ప్రభుత్వం



ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆసరాగా కూటమి ప్రభుత్వం నిలిచింది. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం లేని రోజుల్లో రోజుకు అన్ని ఖర్చులు పోనూ రూ.1000 వరకు వచ్చేది, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తరువాత రూ.400 కూడా గిట్టుబాటు కావడం లేదు. ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయం.

- కండిపల్లి నూకరాజు, పాలకొల్లు

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది : సి.రాజ్‌కుమార్, నరసాపురం



స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లందరం చాలా నష్టపోయాం. మా బతుకులు రోడ్డున పడ్డాయి. అయితే సీఎం చంద్రబాబు డ్రైవర్లకు న్యాయం చేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుంది. దానికి అనుగుణంగా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయం చేయడం అనందంగా ఉంది.

ఆటో డ్రైవర్లకు ఆసరాగా ప్రభుత్వం : కె.శ్రీనివాస్, నరసాపురం



ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా డ్రైవర్లకు ఎంతో ఊరట నిచ్చింది. ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది. ఉచిత బస్సు వల్ల ఇబ్బందులు పడతామని గుర్తించిన ప్రభుత్వం న్యాయం చేసింది. కొన్ని ఇబ్బందులు వల్ల డ్రైవర్లకు సొమ్ములు పడలేదు. వారి సమస్యల్ని పరిష్కరించి అందరికి ఆర్థిక సాయం అందించాలి.

ప్రభుత్వం సాయం సంతోషకరం : చీలి అశోక్, రేలంగి



ఎనిమిదేళ్ల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ఆటో డ్రైవర్ల ఇబ్బందులను అర్థం చేసుకుని సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో రోడ్లు బాగోలేక వాహనాలు చెడిపోయేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చాలా సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందం కలిగిచింది : ఆండ్రు రాజశేఖరరావు, తీపర్రు



ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం ఎంతో లాభదాయం. తన బ్యాంక్ ఖాతాకు రూ.15 వేలు జమ అయ్యాయి. ప్రస్తుతం ఆటోలు ఎవరూ ఎక్కకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. పిల్లల ఫీజులకు అప్పు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వ సాయం ఎంతో ఆనందం కలిగించింది. సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు.

అన్ని వర్గాలకు మంచి ప్రభుత్వం : ఎన్. సత్యనారాయణ, ఆకివీడు



ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత కిరాయిలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ సమయంలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఖాతాలో జమ చేయడం శుభసూచికం. ఈ ప్రభుత్వం అన్ని వర్గాలకు మంచి చేస్తుంది.

మరో రూ.5వేలు ఇవ్వాలి : కె.వెంకటేశ్వరరావు, టీపీగూడెం



ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చే డబ్బులకు అదనంగా వచ్చే సంవత్సరం మరో రూ.5వేలు కలిపి ఇవ్వాలి. ప్రభుత్వం ఆదుకుని రూ.15వేలు ఇవ్వడం అభినందనీయం. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మరింత ఆదుకోవాలి. ప్రభుత్వానికి బాసటగా మేమంతా నిలుస్తాం.

ప్రతిపక్షాల విమర్శలకు తావులేదు : బి.వరప్రసాద్, టీపీగూడెం



ప్రభుత్వం విధానంతో ప్రతిపక్షాల విమర్శలకు తావులేదు. 50 ఏళ్ల పైబడిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ వంటి స్కీములు పెడితే బాగుంటుంది. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలి. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలి.

సరైన సమయంలో సాయం చేశారు : ఆర్.శ్రీను, తణుకు



వచ్చే నాలుగు రోజుల్లో తన వాహనానికి బీమా చెల్లించాల్సి ఉంది. ఎలా చెల్లించాలనే ఆలోచనలో ఉన్న నాకు కూటమి ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకుంది. ఇది మర్చిపోలేని ఘటన. గ్రీన్ టాక్సు తగ్గించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి.


ప్రభుత్వం చేయూత అందించింది : జోసఫ్,ఆకివీడు



ప్రభుత్వం అన్నమాట నిలబెట్టుకుంది. ఆటో డ్రైవర్లకు మరింత చేయూత అందిస్తే బాగుంటుంది. గతంలో రోడ్లు బాగా లేకపోవడంతో వచ్చిన కిరాయిలు మరమ్మతులకే సరిపోయేవి. మిగిలేవి కావు. ప్రస్తుతం ప్రభుత్వంలో రోడ్లు వేయించడం వల్ల అటువంటి సమస్య లేదు.

ఆచార్యదేవో భవ

నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



పోలవరం/ద్వారకాతిరుమల, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్య దేవోభవ.. అంటే తల్లి, తండ్రి తర్వాత గురువుకి ప్రత్యేక స్థానం కల్పించారు. తల్లి జన్మనిస్తే.. తండ్రి బతుకునిస్తే గురువు బతకడం ఎలాగో నేర్పుతాడు. ఎంతటి మేధావి అయినా గురువు వద్ద విద్య నేర్వకపోతే ఆ చదువులు నిరర్థకం. అన్ని విద్యలను నేర్పేవాడు గురువు ఒక్కడే.. అక్టోబరు ఐదో తేదీ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులను వారి సేవలను గుర్తిస్తూ ప్రత్యేక కథనం. ప్రతి ఏటా అక్టోబరు ఐదో తేదీని ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు. విద్యను నేర్పి, బతుకునిచ్చిన గురువులను గౌరవిద్దాం.. పూజిద్దాం.. ఆరాదిద్దాం వారి బాటలో ప్రయాణిద్దాం.

ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ పెద్దిరాజు..

- ద్వారాతిరుమల మండంలంలోని గుణ్ణంపల్లి హైసూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మద్దాల పెద్దిరాజు మాస్టారు. విద్యార్థుల నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వ్యాసరచన, వక్తృత్వ, పద్యపఠన పోటీల్లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో తెలుగు సబ్జెక్టుకు సంబంధించి అద్భుతాలు సృష్టిస్తున్నారు. 18 ఏళ్లగా తన ఉద్యోగ ప్రస్థానంలో విద్యార్థులతో ఆయన ఎన్నో విజయాలు సాధించారు. పుస్తక రచయితగా సైతం పేరుగణించారు. పీహెచ్‌డీ చేసిన ఈయన 'స్మైల్ రచనలు అనుశీలన, సాహితీ సిరులు' వంటి పుస్తకాలు ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఇదే మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. పంగిడిగూడెం స్కూల్‌లో పనిచేసిన కాలంలో అక్కడ నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని తన సొంత డబ్బును వెచ్చించి షెల్ఫ్‌లు కట్టించారు. దాతల నుంచి నేరుగా దాదాపు 200 పుస్తకాలు సేకరించడంలో ప్రముఖపాత్ర పోషించారు. ప్రతీ విద్యార్థి తన పుట్టినరోజున ఓ పుస్తకాన్ని లైబ్రరీకి కానుగా ఇచ్చే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఈయన చేస్తున్న కృషిని అభినందిస్తూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సైతం విద్యార్థుల ఉన్నతికి అవసరమయ్యే దాదాపు రూ.5వేలు విలువైన పుస్తకాలను అందజేశారు.



ఎమ్మెల్యే మద్దిపాటి అందజేసిన పుస్తకాలతో టీచర్ పెద్దిరాజు

వివాహేతర సంబంధానికి యువకుడి బలి

- హత్య కేసులో ఆరుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన గూడెం డీఎస్పీ విశ్వనాథ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథన్

తణుకు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఓ యువకుడి నిండు ప్రాణం బలి గొంది. తణుకులో అదృశ్యమైన తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్ హత్య కేసులో ఆరు గురిని అరెస్టు చేసినట్టు గూడెం డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. తణుకు పట్టణ పోలీస్ స్టేషన్ ల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తాడేపల్లి గూడేనికి చెందిన మడుగుల సురేశ్‌ను హత్య చేసి గోనె సంచిలో మూటకట్టి గోదావరిలో పడే సిన కేసులో ప్రధాన నిందితుడు న్యాయవాది తిర్రే సత్యనారాయణ రాజు, ఆయన సతీమణి తిర్రే శిరీష, తణుకు పాతూరు, ఇరగవరం కాలనీకి చెందిన వల్లూరి పండుబాబు అలియాస్ పండు, సరెళ్ల సాయి, బంటు ఉదయ్ కిరణ్ అలియాస్ బన్నీ, గంటా ఫణీంద్ర బాబులను అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు తెలిపారు. తాడేపల్లి గూడేనికి చెందిన మడుగుల సురేశ్ గత నెల 23న తణుకులో అదృశ్యమవడంతో సోదరి ప్రశాంతి గత నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా కేసు వివరాలు తెలుసుకుని అతి తక్కువ కాలంలోనే ఛేదించినట్టు తెలిపారు. యువకుడి హత్య అనంతరం మృతదేహాన్ని కారులో తరలించినట్లు వివరించారు. సుమారు పది రోజుల తర్వాత డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం వద్ద గోదావరిలో గుర్తించినట్లు చెప్పారు. న్యాయవాది సత్యనారాయణరాజు భార్య శిరీషతో వివాహే తర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందన్నారు. మృతదేహాన్ని తరలించడానికి వినియోగించిన కారుతో పాటు మృతుడు సురేశ్ మోటారు సైకిల్, నిందితులు వినియోగించిన మోటార్ సైకిల్ కలిపి మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న కారు యజమాని, న్యాయవాది సోదరుడు తిర్రే విజయకృష్ణను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. కేసును ఛేదించడానికి సహకరించిన సీఐలు ఎన్.కొండయ్య, బి.కృష్ణ కుమార్‌లతో ఎస్‌ఐలు ప్రేమ్‌కుమార్, ప్రసాదు, సిబ్బంది సంగీతరావు, సత్యనారాయణ, శ్రీధర్, అప్పారావు, రవి, అక్బర్, వెలగేశ్వరరావు, అన్వర్, శ్రీనివాసు, శివాజీ, రాంబాబు, రామారావు, చంద్రబోస్, లోక సుందరిలను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

రైల్వేగేటు - పాట్లు

ఏలూరు పవర్‌పేట రైల్వే గేటు వద్ద ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు గేటు తెరుచుకోలేదు. ఈవిషయమై రైల్వే గేటు సిబ్బందిని అడుగగా మరమ్మతు వచ్చిందని, ఆలస్యం అవుతుందని ప్రయాణికులకు తెలిపారు. గేటు తెరవక పోవడంతో ఆ దారిలో వెళ్లే ప్రయాణికులు, ప్రజలు మరోదారి లేక రైల్వేగేటు కింద నుంచి దూరి అవస్థలు పడుతూ దాటి వెళ్లారు.

- ఫొటోగ్రాఫర్, ఏలూరు.




రైలు గేటు కింద నుంచి ఇబ్బంది పడుతూ వెళుతున్న దృశ్యాలు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఫ్యాప్టో ధర్నా విజయవంతానికి బైక్ ర్యాలీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు శనివారం ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రధాన రహదారుల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ, నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాశ్, రమేశ్, రామారావు, పవన్‌కుమార్, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 7న జరగనున్న ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)పరీక్షకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువును పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పరీక్ష రుసుం చెల్లించేందుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉందని, ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును డీఈవో కార్యాలయంలో 18వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరుతూ శనివారం ఏలూరు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. డిగ్రీ తరగతులు ప్రారంభించి 17 సంవత్సరాలు గడిచినప్పటికీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదని, పీడీఎస్‌యూ పోరాటాల ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని 3.60 ఎకరాల స్థలాన్ని కేటాయించారని సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని మంత్రికి వివరించారు. భవన నిర్మాణాలకు రూ.12.50 కోట్ల నిదులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు నిధులు విడుదలకాలేదని తెలిపారు. మంత్రిని కలిసిన పీడీఎస్‌యూ నాయకుల్లో యశ్వంత్, శంకర్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

కామవరపుకోట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడమిల్లి గ్రామానికి బోణాల వంశీ అనే యువకుడు విద్యుత్ లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. వంశీ శనివారం పొలాల్లో విద్యుత్ స్తంభం ఎక్కి లైన్ సరిచేస్తుండగా ఆకస్మికంగా విద్యుత్ షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వంశీ చాతికి మంటలు అంటుకోవడంతో అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు జరిగిన సంఘటనపై విచారణ నిర్వహిస్తున్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

పెదవేగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చట్టాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జాగృతి పథకం - గ్రామీణ స్థాయిలో ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, ఉచిత న్యాయ సేవల అమలుపై పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కార్మికులు పని ప్రదేశాల్లో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. అనంతరం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏలూరు రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ స్పందన, పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి పీవీఎస్ఎన్ లక్ష్మీలావణ్య, తణుకు రెండో అదనపు సివిల్ జడ్జి కె.కృష్ణవేణి, నిడదవోలు అదనపు సివిల్ జడ్జి షేక్ రహీమాన్, పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ, పెదపాడు సీడీపీవో ఫాతిమ, సూపర్‌వైజర్లు సీహెచ్.పార్వతి, కె.మేరీబాయి, కె.శాంతారత్నం పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో పలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయం మార్చుకోకపోతే విద్యార్థి, యువజన సంఘాలతో పాటు తమతో పాటు కలిసి వచ్చే ప్రజా సంఘాలతో పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జనవిజ్ఞాన కేంద్రం నాయకులు పి.వి.నారాయణ, సుధాకర్, న్యాయవాదులు విజయ భాస్కర్, బీఎస్పీ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన

ఏలూరు రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎస్‌డీటీ నాగమణి కోరారు. ఏలూరు మండలం మానూరులో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి రీసర్వే చేపట్టినప్పుడు రైతులు రుజువు పత్రాలను చూపించి రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. డీఐ రమణారావు పాల్గొన్నారు.

● లింగపాలెం: భూముల రీ సర్వేకు సంబంధించి రెండు విడతలు పూర్తి చేయగా ప్రస్తుతం మూడో విడత ప్రారంభమైంది. ఇందులో భాగంగా మండలంలోని బాదరాల, పాశ్వానగరం గ్రామాల్లో తహసీల్దార్ నజీ ముల్లాషా ఆధ్వర్యంలో రీసర్వేపై అవగాహన కల్పించారు. గతంలో జరిగిన రీసర్వేలో తప్పులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల్లో ఎలాంటి అపోహలు వద్దన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సర్పంచ్ బి.శ్రీనివాసరావు, డీటీ నాగబాబు, సుధీర్ పాల్గొన్నారు.

ఘనంగా అన్న ప్రసాద వితరణ

కామవరపుకోట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో గత నెల 22 నుంచి ఈనెల 2వ తేదీ వరకు దేవీనవరాత్రులు ఘనంగా ముగిసిన నేపథ్యంలో పీఠంలో ప్రాంగణంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణలు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. తొలుత పీఠంలో ఈ బృందం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గాబాబు బృందం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను, మాజీ ఎమ్మెల్యే మురళీరామకృష్ణలను ఘనంగా సత్కరించారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గాబాబు, సత్యశ్రీనివాస్‌లు భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపించారు.

జీఎస్టీ సంస్కరణలతో అందరికీ మేలు

ఏలూరు రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చోదిమెళ్ల గ్రామంలో ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. వ్యవసాయ అనుబంధ రంగాల యంత్రాలపై పన్ను భారీగా తగ్గిన నేపథ్యంలో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ అనిల్ కుమారి శనివారపుపేట సొసైటీ చైర్మన్ వంశీకృష్ణ మాట్లాడుతూ కొత్తజీఎస్టీ విధానంతో ధరలు తగ్గించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఎంఏవో జీవనసంధ్య, హార్టీకల్చర్ ఏడీ సంతోశ్, యడ్లపల్లి శివ పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో భవానీ దీక్షను విరమించి తిరిగి ఆటోలో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన చీరాల ఐశ్వర్య, చీరాల జోషిక్, వాడబోయిన సతీశ్ కుమార్, సుగుణ, కొల్లి ఉమాదేవి కలిసి అదే గ్రామానికి చెందిన తుంపల జగదీశ్ ఆటోలో బయలుదేరి విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్లి దీక్షను శుక్రవారం రాత్రి విరమించారు. శనివారం ఉదయాన్నే తిరిగి రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని బొమ్మలూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా కొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లిపోయారు.

పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు



పోలవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీసుదర్శన కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా , తూర్పుగోదావరి జిల్లాల నుండి తొమ్మిది శనివారాల భక్తులు కాలినడకన వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. విష్ణు సహస్రనామార్చన, వేంకటేశ్వస్వామి కళ్యాణం నిర్వహించారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ మహిళలు పులిహోర చక్కెర పొంగలి ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం భేష్

(5వ పేజీ తరువాయి)

నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి ఆరు నెలలు కాలానికి అప్పట్లో 40,231 భూ లావాదేవీలతో రూ.162.08 కోట్ల ఆదాయాన్ని రిజిస్ట్రేషన్‌శాఖ సాధించింది. ఈ ఏడాదిలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 43,811 క్రయ, విక్రయాలతో రూ.176 కోట్ల 98 లక్షల ఆదాయాన్ని ఈ శాఖ సాధించింది. దీంతో గత ఏడాదితో పోల్చుకుంటే 9.1 శాతం అధికంగా ఆదాయం రాబట్టారు.

టెట్ సెట్టవుతుందా..?!

(5వ పేజీ తరువాయి)

సర్వీస్ వున్న ఉపాధ్యాయులందరూ 2027వ సంవత్సరం సెప్టెంబరు 30లోగా టెట్ అర్హత సాధించాల్సిందే. ఇదిలా ఉండగా 2010కి ముందే నియామకం పొందిన టీచర్లు సంబంధిత కేడర్ నుంచి ఇప్పటికే ఉద్యోగోన్నతి పొంది ఉంటే టెట్ అవసరమా, మినహాయింపు ఉంటుందా అనే విషయాలపై సందేహాలు నెలకొన్నాయి.





కొయ్యలగూడెంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, వట్లూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ పాల్గొన్న దృశ్యం

ఆటో డ్రైవర్ల సంబరాలు..

» బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు జమ
» పలు చోట్ల ఉత్సాహంగా ర్యాలీలు

పెదపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అండగా ఉందని చెప్పడమే ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు.పెదపాడు మండలం వట్లూరులోని టీటీడీసీలో ఆటో డ్రైవర్ల సేవలో సమావేశం ఎమ్మెల్యే చింతమనేని అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ద్వారా ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విజయవాడలో జరిగిన లైవ్ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను వేధింపులకు గురిచేసిందని,ఇప్పుడు అవేమీ లేవన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. అనంతరం 1846 మందికి చెందిన రూ.2 కోట్ల 76లక్షల 90 వేల నమూనా చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేశారు. పలువురి ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు నగదు జమ కావడంతో మెసేజ్‌లను ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి సభలో ప్రదర్శించారు.డీఆర్డీఏ పీడీ విజయరాజు, మోరు శ్రావణి, ఉప్పలపాటి రాంప్రసాద్, బొప్పూడి కాశీబాబు, మరడాని రవి, కొమ్మన లక్ష్మణమోహన్, ముళ్లపూడి సాంబశివరావు, కలిపిండి అప్పారావు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ఆటో కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌లు ప్రారంభించారు. నియోజకవర్గంలోని 1360మంది ఆటోలకు గానూ 2కోట్ల 4లక్షల రూపాయలు నిధులను పోలవరం నియోజకవర్గంలో కార్మికులకు అందజేశారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ముక్కంటి, ఐటీడీఏ పీవో రాముల నాయక్, కూటమి నాయకులు కరాటం సాయి, బొల్లిన నిర్మలా కిషోర్, పారేపల్లి రామారావు, గంగిరెడ్ల మేఘలాదేవి, కరాటం ఉమా, శీలం వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి,టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్, మండల బీజేపీ అధ్యక్షుడు వాసు, మాదేపల్లి శ్రీను, రమాద పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన..

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా మండలంలోని బయ్యన్నగూడెం నుంచి కొయ్యలగూడెం వరకు రైతులు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీఏ బుజ్జిబాబు, ఎంపీడీవో కిరణ్ కుమార్, ఏవో పోశారావు పాల్గొన్నారు.

● లింగపాలెం: 'ఆటో డ్రైవర్‌ల సేవలో' పథకంలో భాగంగా ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు జమ చేయడంతో మండలంలోని ఆటో డ్రైవర్‌లు హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు తమ ఆటోలతో మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పలువురు కూటమి నేతలు ఆటోలలో ప్రయాణించి వారిలో ఉత్సాహం నింపారు.

● చింతలపూడి: ఆటో డ్రైవర్లకు ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినప్పటికీ రూ.15 వేల ఆర్థిక సాయం సీఎం చంద్రబాబు అందించారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన సభలో మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని సుమారు 1540మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున 2 కోట్ల 31 లక్షల 45 వేల రూపాయల చెక్కును ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల షర్టు ధరించి ఆటో నడిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా బ్యాంకు ఖాతాల్లో రూ.15000 జమ కావడంతో శనివారం శనివారంపేటలో మదర్ ఇండియా ఆటో స్టాండ్‌లోని ఆటో డ్రైవర్లు సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాల్లో మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, శనివారం పేట సొసైటీ డైరెక్టర్ సోమిశెట్టి రామ్మోహనరావు, ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షుడు మట్టా రంజిత్, అధ్యక్షుడు చాన్‌భాషా, సెక్రటరీ గుత్తి కాశి, టీడీపీ నాయకులు వేమూరి శ్రీధర్, మట్ట శ్రీనివాసరావు, గణేష్, కడియాల విజయలక్ష్మీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

లాంచీ సర్వీసులు పునరుద్ధరించండి

పోలవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి పురుషోత్తపట్నం రాకపోకలు సాగించే రేవు లాంచీ సర్వీసులు వరద ప్రమాద హెచ్చరికలతో నిలిపివేయడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరం పరిసర గ్రామాల నుంచి కన్నాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, నిడదవోలు ఇతర పట్టణాల నుంచి పురుషోత్తపట్నం,సీతానగరం, వంగలపూడి, పోశమ్మగండి, గోకవరం గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు పోలవరం బోట్ పాయింట్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి లాంచీపై ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇటీవల వరద తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు ఫెర్రీ నిర్వాహకులు గత 25 రోజులుగా లాంచీల సర్వీసులు నిలిపివేశారు. దీంతో పురుషోత్తపట్నం, గోకవరం, వంగలపూడి, సీతానగరం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు పోలవరం నుంచి రాజమహేంద్రవరం చేరుకుని అక్కడి నుంచి తమ గమ్య స్థానాలకు చేరుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాక లాంచీలు నిలిపివేసిన విషయం తెలియని దూర ప్రాంతాల ప్రయాణికులు పోలవరం బోట్ పాయింట్ వద్దకు చేరుకుని లాంచీల సర్వీసులు లేక రాజమహేంద్రవరం చేరుకుని అక్కడి నుండి ప్రయాణాలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సమయం వృధా, అదనపు ప్రయాసలతో అదనపు చార్జీల భారంతో ఇబ్బందులకు గురవుతున్నామని గోదావరి వరద ఉధృతి తగ్గిన నేపథ్యంలో పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు లాంచీల రాకపోకలు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ ఆటల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అరుణ్

పెదపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 6, 7వ తేదీల్లో మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నరసింహమూర్తి, మండల గేమ్స్ కన్వీనర్ మల్లేశ్వరి తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14కు 2012 జనవరి 1 తరువాత, అండర్-17కు 2009, జనవరి 1 తరువాత పుట్టిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

8న విజయరాయి జడ్పీ హైస్కూల్లో..

పెదవేగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 8న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పెదవేగి మండల ఎంఈవో -2 వి.అరుణ్ కుమార్ తెలిపారు. 14ఏళ్ల విభాగం, 17ఏళ్ల విభాగంలో బాల, బాలికలకు ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విజయరాయిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో పోటీల వివరాలను తెలియపర్చారు.ఖోఖో కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, చెస్, యోగా సంబంధించిన విభాగాల్లో ఆటల పోటీలు జరుగుతాయన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు, డివిజన్ కార్యదర్శి కె.రాజగోపాల్, మండల కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శనివారపు పేట జడ్పీ పాఠశాలలో...

ఏలూరు రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ఈనెల 8,9 తేదీల్లో జరిగే ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయాలని ఎంఈవో-2 అరుణ్ కుమార్ కోరారు. శనివారపు పేట జడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో క్రీడా జట్ల ఎంపిక పోటీల నిర్వహణపై చర్చించారు. 43 క్రీడాంశాల్లో 14, 17 ఏళ్ల విభాగం బాలుర, బాలికల వేదికలు ఖరారు చేసినట్టు ఎంఈవో తెలిపారు. ఏలూరు ఇండోర్ స్టేడియం, శనివారపుపేట జడ్పీ పాఠశాలల్లో వేదికలు ఖరారు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం ప్రకాశ్ రావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఇందుకూరి రమేష్, ఎస్జీఎఫ్ సెక్రటరీ కె.దుర్గాప్రసాద్, మండల కోఆర్డినేటర్ పి.పద్మలత పాల్గొన్నారు.

కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో

దెందులూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి క్రీడా ఎంపికలు ఈ నెల 8న కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పీఈటీలతో క్రీడల నిర్వహణకు సమీక్ష నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయాల ఆస్తులను పరిరక్షించాలి : ఎమ్మెల్యే చంటి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : దేవాలయాలకు, ధర్మసత్రాలకు నియమితులైన చైర్మన్‌లు, సభ్యులు ఐకమత్యంగా ఉండి ఆలయాలు, సంస్థల ఆస్తులను కాపాడుతూ దేవాలయాల పవిత్రతను కాపాడుకుంటూ భక్తులకు మెరుగైన సేవలందించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి సభ్యులచే ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జరిపించారు. ఈ మేరకు చైర్మన్‌గా ఘంటా శ్రీకృష్ణ సత్య శివ గణేష్(బాబ్జి)తో, ట్రస్టీలు పప్పు మురళీకృష్ణ, కలిగొట్ల ఫణిరాజు, ఆదుర్తి శ్రీనివాస్, ఆనమిల్లి ధనలక్ష్మి, ఎండమూరి వీరలక్ష్మీ, జోగి మంజూ, బంగారు గణేశ్వరి, మానుకొండ అప్పారావు, ఎక్స్ అఫిషియో మెంబర్ కందుకూరి రామ బ్రహ్మానందశర్మలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా చెరుకువాడవారి సత్రంకు చైర్మన్‌గా గుర్రం సాంబమూర్తి, ధర్మకర్తలుగా ఎం.రామాంజనేయులు, ఆర్.గంగాధరరావు, ఎం.గోపీకృష్ణ, జి.వెంకటరత్నం, వి.రామకుమారి, వై.శ్రీనివాసరావు, డి.నాగలక్ష్మి, ఎస్.ఉషారాణిలతో ప్రమాణం చేయించారు. చుండూరివారి సత్రం చైర్మన్‌గా జోగి త్రినాథ శ్రీనివాస్, ధర్మకర్తలుగా పిల్లి రవి, ఘంటా రాంబాబు, నడిపూడి లక్ష్మీ, నర్రు సత్యవతి, దశవరపు రమణ, తేజోమూర్తుల నాగేశ్వరరావు, నేదురు రాజు, సింహాద్రి లక్ష్మీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, యుడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యనిర్వహణాధికారులు ఎం.రామాంజనేయులు, సి.హెచ్.వెంకట నాగమునేశ్వరరావు, సైదు సెహ్రాలతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అర్చక బృందం పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బృందానికి దేవాలయాల నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కోలాహలంగా ప్రమాణస్వీకార మహోత్సవాన్ని మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ వేద మంత్రాలతో జరిపించారు. కాశీ విశ్వేశ్వరాలయంలో ఎమ్మెల్యే బృందం పూజలు నిర్వహించింది.

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది అంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్వామికి వివిధ సేవలు, విరాళాల రూపంలో రూ.3,21,918 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్.వి.చందన తెలియజేశారు. స్వామి వారి నిత్యాన్నదానానికి అయినవిల్లి గ్రామానికి చెందిన కె.వీరవెంకట విశ్వేశ్వరరావు రూ.96 వేలు విరాళంగా అందజేయగా శేషవస్త్రంతో సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ సంఘ నాయకులు

ఏజెన్సీలో అక్రమ కట్టడాలు కూల్చేయాలి

కుక్కునూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో అక్రమకట్టడాలు కూల్చకపోతే ఉద్యమిస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. శనివారం కుక్కునూరులో ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశంలో కుంజా శ్రీను మాట్లాడారు. 5వ షెడ్యూల్ భూ భాగంలో భారతరాజ్యాంగం ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలు, హక్కులు కల్పించిందన్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పాలకులు ప్రభుత్వాధికారులు ఏజెన్సీ చట్టాలను అమలు చేయడంలేదని మండిపడ్డారు. 1/70 చట్టం అమలులో ఉన్న ప్రాంతాల్లో మైదాన ప్రాంతాల నుంచి గిరిజనేతరులు వచ్చి అక్రమకట్టడాలు కట్టి స్థిరనివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుంటున్నప్పటికీ రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి రిజర్వేషన్‌తో కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు ఉండి కూడా ఆదివాసీ చట్టాలు అమలు చేయడంలో విఫలమవుతున్నారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు, సరియం ప్రసాద్, వడియం వేణు, పైదా బుర్రయ్య, పిట్టా శివలింగయ్య, జెట్టి రఘుబాబు పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ మండల మహాసభ

చింతలపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సమావేశం జరుగుతుందని నిర్వాహకులు టి.వరప్రసాద్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని, ఆర్ఎస్ఎస్ 2025 నాటికి శత వసంతాలు పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా హిందువు బంధువు లంతా తరలిరావాలని కోరారు.

నేడు కె.కోటలో ఆర్ఎస్ఎస్ ఉత్సవాలు...

కామవరపుకోట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ చింతలపూడి ఖండ్ ఆధ్వర్యంలో శత వసంతాలు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు మండల స్వయం సేవక్ సంఘ్ నాయకులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి వివేకానంద కన్యాకుమారికి చెందిన సి.హెచ్.సదాశివరావు హాజరవుతారని తెలిపారు. జీలకర్రగూడేనికి లక్ష్మీనారాయణరాజు హాజరవుతారని అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కార్యకర్తలు, స్వయం సేవకులు, హిందూ బంధువులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల ప్రముఖ్‌శ్రీ తెలిపారు.



తోపుడు బండి అందజేసిన దాతలు

మహిళకు తోపుడు బండి అందజేత

ఏలూరు రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ నిరుపేద కుటుంబానికి ఆర్థిక పరిస్థితి బాగాలేదని జీవన ఉపాధి కోసం సహకారం కావాలని కోరడంతో ఇంపాక్ట్ ఐసిఐ ఇంటర్నేషనల్ ఏలూరు హైమావతి క్లబ్ అధ్యక్షుడు ఎంఎల్ నరసింహరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవ లక్ష్యంగా పేదలకు అవసరమైన కార్యక్రమాలు చేపడుతూ సాయం అందిస్తున్నామన్నారు. సాహితీవేత్త గురుశర్మ, కె.నాగజ్యోతి, ప్రసాద్, శ్వేత, వర్ధిని, శ్రీనివాస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు జగపతిరావు మృతి

చింతలపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు చీకటి జగపతిరావు(80) శనివారం సాయంత్రం అంకులే కొత్తగూడెంలోని ఆయన నివాసం వద్ద మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా టీడీపీ రైతు అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మాజీ టీడీపీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఉన్నారు.

ఇంటర్వ్యూ..

సొసైటీని లాభాల బాట పట్టిస్తా

రేగంటి రాంబాబు,
సహకార సంఘ చైర్మన్, జి.కొత్తపల్లి



● మీ సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలేన్ని?

ఏడు గ్రామ పంచాయతీలు కాగా.. అందులో 13 గ్రామాలున్నాయి.

● సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలేమిటి?

గత వైసీపీ హయాంలో మూత పడిన పెట్రోల్ బంక్‌ను తెరిచి వ్యాపారం ప్రారంభించాం. నాణ్యమైన పెట్రోల్‌ను తమ సొసైటీ ద్వారా వినియోగదారులకు అందిస్తున్నాం. అలాగే సంఘ పరిధిలోని 4 ఎరువుల గొడౌన్ల ద్వారా రూ.5 కోట్ల వరకూ ఎరువుల అమ్మకాలు చేస్తున్నాం.

● ఇంకా రైతులకు, ప్రజలకు ఏం చేయాలనుకుంటున్నారు

ఆగస్టు 13న బాధ్యతలు చేపట్టే నాటికి రూ.3.50 కోట్లు నష్టాల్లో సొసైటీ నడుస్తోంది. ఏడాదిలో సంఘాన్ని అన్ని విధాలా లాభాల బాటలో పట్టించేందుకు చర్యలు తీసుకున్నాం. సంఘం ద్వారా జనరిక్ మందులషాపు, నిత్యావసరాల విక్రయాలు, డ్రైఫ్రూట్స్ అమ్మకాలు చేపట్టాలన్న ఆలోచన ఉంది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సహాయ సహకారాలతో రైతులకు మరిన్ని సేవలందిస్తాం.

● రైతులకు అందించే రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయం గురించి..

గత ప్రభుత్వంలో 90 మందికి అమూల్ మిల్క్ కలక్షన్ ఏజంట్ల సిఫార్సుతో పాడి రైతులుగా చూపించి రూ.90 లక్షల రుణాలు అందించారు. వారి నుంచి ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమకాలేదు. వారికి ఇప్పటికే డిమాండ్ నోటీసులు అందజేశాం.. కొందరు స్పందించి కొంత మేర సమయం కోరారు. స్పందించని వారికి లీగల్ నోటీసులిచ్చాం.. ప్రతీ పైసా రికవరీ చేస్తాం, ఎల్‌టి, కౌలు రైతుల రుణాలు గడచిన 2007 నుంచి జమకాలేదు... రికవరీ నిమిత్తం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. మొండి బకాయిలు వసూలు చేసి సంఘాన్ని లాభాల బాట పట్టిస్తాం.. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత నమ్మకంతో ఈ రెండు నెలల్లోనే రూ.90 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు సంఘానికి వచ్చాయి. ఇప్పటి వరకూ సంఘంలో మొత్తం రూ.1.80 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.

(ద్వారకాతిరుమల-ఆంధ్రజ్యోతి)

బుట్టాయగూడేనికి అవార్డులు

బుట్టాయగూడెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా బుట్టాయగూడెం మండలానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి. కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని విప్పలపాడు గిరిజన సంక్షేమ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలకు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో పరిసరాల పరిశుభ్రత పాటించడంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నందుకు రాష్ట్ర స్థాయి అవార్డులు ఇచ్చారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

కొయ్యలగూడెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు దగ్గర్లో జనసేనపార్టీ జెండాస్థూపాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కూటమి కార్యకర్తలంతా అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, పాతకాకుల రత్నరాజు, ముప్పిడి చినబాబు, చెప్పుల మధు, గొలిశెట్టి శ్రీనివాస్, జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు పోలీసులు తనిఖీలు నిర్వహించి చికెన్ వేస్ట్‌తో కూడిన కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌ను, కంటైనర్‌లోని చికెన్ వ్యర్థాలు స్వాధీనం చేసుకుని వాహన యజమాని,డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీకాళహస్తి ఆలయ డైరెక్టర్‌గా నాగరాజు

చింతలపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దేవస్థానం డైరెక్టర్‌గా జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజును నియమించారు. ఈ మేరకు నాగరాజు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.నాగరాజు మాట్లాడుతూ బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.



జై గౌడ సేన సంఘం ఎన్నిక

దెందులూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):గౌడ సంఘం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని జైగౌడ సేన ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎంపికైనా చల్లచింతలపూడి గ్రామానికి చెందిన నూతి రవీంద్రర్ గౌడ్, జైగౌడ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా గాలాయగూడెం గ్రామానికి చెందిన మట్టా వెంకటేష్ అన్నారు. విజయవాడలోని జైగౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు మెర్ల ఏడుకొండలు వారికి ఎంపికైన ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రవీందర్, వెంకటేశ్‌లకు బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ముదినేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఎస్పీఎం ఐటీఐ కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానోత్సవం శనివారం జరిగింది. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ పాస్ సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ హరిత టీఓలు ఓలేటి మణిభీమరాజు, ఉమా మహేశ్వరరావు, డీటీఓ బి కృష్ణమోహన్, ఎన్వి శివ, వి విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి మండలం సింగరాయపాలెం నుంచి ర్యాలీగా బయల్దేరిన ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లకు దసరా కానుక

జిల్లాలో 10,655 మందికి రూ. 15.98 కోట్లు

'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో మంత్రి పార్థసారథి



నూజివీడులో లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10,655 మంది ఆటో డ్రైవర్లకు రూ. 15.98 కోట్లు జమచేసి దసరా కానుకను కూటమి ప్రభుత్వం అందించిందని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఖాకీ డ్రెస్‌ను ధరించి మంత్రి నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సభా స్థలివరకు ఆయన ఆటోను నడుపుతూ ముందుకు సాగారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో 1996 మంది ఆటో డ్రైవర్లకు రూ. 2.99 కోట్లు అందించటం జరిగిందన్నారు. నమూనా చెక్కును ఆయన ఆవిష్కరించారు. గత ప్రభుత్వం రూ.10వేలు చొప్పున 2.30 లక్షల మందికి రూ.230 కోట్లు మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.15 వేలు చొప్పున 2.91 లక్షల మందికి ఆటోడ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా అందించిందన్నారు. ఆటోడ్రైవర్లకు గ్రీన్‌ట్యాక్స్ నుంచి వెసులుబాటు కల్పించటం కూడా జరిగిందన్నారు. నూతనంగా ఆటో కొనుగోలు చేసుకునే వారికి జీఎస్టీ తగ్గింపు ద్వారా రూ.24వేల వరకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోందన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్టీసీ జోన్ -2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, ఉప రవాణా కమిషనర్ కరీమ్, కమర్షియల్ ట్యాక్స్ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా..

కైకలూరు: రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రతి ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు అందిస్తుందని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1209మంది ఆటో కార్మికులు ఉండగా వారికి రూ.1,81,35,000లు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10 వేలు ఇచ్చినప్పటికీ అధ్వాన రహదారుల్లో రాకపోకలు సాగించడం వలన ఆటోల మరమ్మతులకే ఎక్కువ ఖర్చు చేశారని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్ని రహదారులు అభివృద్ధి చెందడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయన్నారు. టీడీపీ కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మి, బలే ఏసు రాజు, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ రాజు, పోకల జోగిరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు వీజేఎస్ మాల్యాద్రి, కొడాలి వినోద్, అంద్రాజు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కీర్తి వెంకటరామ్ ప్రసాద్, బోడావుల జగదీశ్, జనసేన నాయకుడు వీరంకి వెంకయ్య, తెలుగు మహిళా నాయకురాలు లక్ష్మీరాణి, జిల్లా మత్స్యశాఖాధికారి నరసయ్య, ఆర్టీవో అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు స్వావలంబనే లక్ష్యం

చాట్రాయి: శ్రమజీవులకు స్వావలంబన కల్పించటమే ఆటో డ్రైవర్ల సేవలో పథకం లక్ష్యమని చనుబండ పీఏసీఎస్ చైర్మన్ ఎం. శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు నక్కా రాము అన్నారు. నూజివీడులో మంత్రి సభకు సూరంపాలెం నుంచి ఆటోలతో ర్యాలీగా తరలివెళ్లారు. అలాగే బూరుగుగూడెం నుంచి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్ ఆధ్వర్యంలో ఆటో ర్యాలీగా నూజివీడు వెళ్లారు. టీడీపీ నాయకులు బ్రహ్మయ్య, శివయ్య, శ్రీను, వెంకటేశ్వరరావు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో ఆటోడ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న కూటమి నాయకులు



సూరంపాలెం నుంచి నూజివీడుకు ఆటో ర్యాలీగా టీడీపీ నాయకులు

మురిసిన ఆటో డ్రైవర్లు

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తుంది. గత దీపావళికి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయగా.. ఇప్పుడు దీపావళి ముందుగానే ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించి వారి మనస్సు గెలుచుకుంది. ఆటో డ్రైవర్ల అభిప్రాయాలు ఇలా..

భరోసా ఏర్పడింది..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ఆటో, క్యాబ్, కారు డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు కిరాయిలు తగ్గడంతో పాటు, సర్వీస్ ఆటోలు ఆగిపోయాయి. తమ ఇబ్బందులను గమనించి కూటమి ప్రభుత్వం ఏడాదికి డ్రైవర్లకు రూ. 15వేలు ఆర్థిక సహాయం అందించడం ఆనందంగా ఉంది.

-నీలం శివ రమేష్, ఆటో డ్రైవర్, శ్రీహరిపురం, ముదినేపల్లి మండలం

ఆటో డ్రైవర్లకు ధీమా



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ఎంతో ధీమా కల్పించింది. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యంతో రెండు నెలలుగా ఆటోలకు కిరాయిలు తగ్గాయి. ఆ లోటును భర్తీ చేసి ఆటో, కార్లు, క్యాబ్ డ్రైవర్లను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడం ఆనందంగా ఉంది.

-పెరుమాళ్ళ సత్యనారాయణ, ఆటో డ్రైవర్, పెదకామనపూడి, ముదినేపల్లి మండలం

రాజధాని నిర్మాణానికి టీచర్ల విరాళం



విరాళాలు పంపుతున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నిర్మాణానికి విరాళాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్, ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి పిలుపునకు ఉపాధ్యాయ వర్గాలు స్పందించాయి. రూ. 116లు విరాళం ఇవ్వండి అమరావతిని కాపాడండి అని వైష్ణవి చేస్తున్న ప్రచారానికి ముందుకు వచ్చిన ముదినేపల్లి మండలంలోని ఉపాధ్యాయులు శనివారం తమ వంతు విరాళాలను ఏపీసీఆర్‌డీఏ బ్యాంకు ఖాతాకు క్యూ ఆర్ కోడ్ ద్వారా పంపించారు. వైష్ణవి నివాసం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎంఈవో -1 డి. రామారావుతో పాటు సుమారు 60 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పాల్గొని రూ. 20 వేల విరాళాలను సీఆర్‌డీఏ ఖాతాకు పంపారు. వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు బలుసు రఘురామయ్య, కృష్ణారావు, కోడూరు అర్జునరావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీమన్నారాయణ

ఆగిరిపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర పరిశోధన విద్యా శిక్షణ మండలి ప్రొఫెసర్ శ్రీమన్నారాయణ అన్నారు. మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా రెండో రోజు తోటపల్లిలోని హీల్ స్కూల్లో జరుగుతున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించే విధంగా విద్యాబోధన జరగాలని అన్నారు. రాష్ట్ర పరిశోధన విద్యా శిక్షణా మండలి పరిశీలకులు సృజన, డాక్టర్ రావి అరుణ, ఏఎంఓ రెడ్డి రామారావు, ఎంఈవోలు ఆనంద్‌కుమార్, బీవీఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు క్యాటిల్ షెడ్ల నిర్మాణం



ముసునూరులో పశువుల షెడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

ముసునూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశువుల సంరక్షణకు ప్రభుత్వం క్యాటిల్ షెడ్ల నిర్మాణాలను చేపట్టిందని సర్పంచ్ కొండేటి విజయ లక్ష్మి యిర్మీయా అన్నారు. శనివారం ముసునూరు ఎస్సీ కాలనీలో రూ. 2 లక్షలతో నిర్మించే క్యాటిల్ షెడ్‌కు ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీవో బీపీ సత్యనారాయణతో కలిసి సర్పంచ్ శంకుస్థాపన చేశారు. ఏపీవో రోజిలీల మాట్లాడుతూ ఉపాధి నిధులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ షెడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. రైతులు తమ పశువులకు సంరక్షణ కోసం ఈ షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, పీఏసీయస్ అధ్యక్షుడు దేవినేని శ్రీధర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు గార్లపాటి నరసింహరావు, వార్డు సభ్యుడు వేల్పూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి యువకుడి బలి

▸▸ హత్య కేసులో ఆరుగురి అరెస్టు

తణుకు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఓ యువకుడి నిండు ప్రాణం బలిగొంది. తణుకులో అదృశ్యమైన తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్ హత్య కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్టు గూడెం డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్‌ను హత్య చేసి గోనె సంచిలో మూటకట్టి గోదావరిలో పడేసిన కేసులో ప్రధాన నిందితుడు న్యాయవాది తిర్రే సత్యనారాయణ రాజు, ఆయన సతీమణి తిర్రే శిరీష, తణుకు పాతూరు, ఇరగవరం కాలనీకి చెందిన వల్లూరి పండుబాబు అలియాస్ పండు, సరెళ్ల సాయి, బంటు ఉదయ్ కిరణ్ అలియాస్ బన్నీ, గంటా ఫణీంద్ర బాబును అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు తెలిపారు. తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్ గత నెల 23న తణుకులో అదృశ్యమవడంతో సోదరి ప్రశాంతి గత నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేశాయి. యువకుడి హత్య అనంతరం మృతదేహాన్ని కారులో తరలించినట్లు వివరించారు. సుమారు పది రోజుల తర్వాత డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం వద్ద గోదావరిలో గుర్తించినట్లు చెప్పారు. న్యాయవాది సత్యనారాయణరాజు భార్య శిరీషతో వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందన్నారు. మృతదేహాన్ని తరలించడానికి వినియోగించిన కారుతో పాటు మృతుడు సురేశ్ మోటారు సైకిల్, నిందితులు వినియోగించిన మోటార్ సైకిల్ కలిపి మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న కారు యజమాని, న్యాయవాది సోదరుడు తిర్రే విజయకృష్ణను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. కేసును ఛేదించడానికి సహకరించిన సీఐలు ఎన్.కొండయ్య, బి.కృష్ణ కుమార్‌తో ఎస్ఐలు ప్రేమ్‌కుమార్, ప్రసాద్, సిబ్బంది సంగీతరావు, సత్యనారాయణ, శ్రీధర్, అప్పారావు, రవి, అక్బర్, వెలగేశ్వరరావు, అన్వర్, శ్రీనివాసు, శివాజీ, రాంబాబు, రామారావు, చంద్రబోస్, లోక సుందరిలను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం భేష్

(5వ పేజీ తరువాయి)

నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి ఆరు నెలలు కాలానికి అప్పట్లో 40,231 భూ లావాదేవీలతో రూ.162.08 కోట్ల ఆదాయాన్ని రిజిస్ట్రేషన్‌శాఖ సాధించింది. ఈ ఏడాదిలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 43,811 క్రయ, విక్రయాలతో రూ.176 కోట్ల 98 లక్షల ఆదాయాన్ని ఈ శాఖ సాధించింది. దీంతో గత ఏడాదితో పోల్చుకుంటే 9.1 శాతం అధికంగా ఆదాయం రాబట్టారు.

టెట్ సెట్టవుతుందా..?!

(5వ పేజీ తరువాయి)

సర్వీస్ వున్న ఉపాధ్యాయులందరూ 2027వ సంవత్సరం సెప్టెంబరు 30లోగా టెట్ అర్హత సాధించాల్సిందే. ఇదిలా ఉండగా 2010కి ముందే నియామకం పొందిన టీచర్లు సంబంధిత కేడర్ నుంచి ఇప్పటికే ఉద్యోగోన్నతి పొంది ఉంటే టెట్ అవసరమా, మినహాయింపు ఉంటుందా అనే విషయాలపై సందేహాలు నెలకొన్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు



కలిదిండి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు పని చేయకపోవటంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లో నీరు కొనుగోలు చేసి తాగుతున్నారని తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో మైక్రో వాటర్ ఫిల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామీణులకు సురక్షిత నీరు అందించటానికి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు చేయించాలన్నారు. చేపలు, రొయ్యల చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల సహకారంతో ఆక్వా రైతులు చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యను అందించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

'స్టీవెన్ బాబుపై వేధింపులు ఆపాలి'

ముదినేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నంబూరులోని ఐఓసీఎల్ బంకు డీలర్ మదిర స్టీవెన్ బాబును ఆ సంస్థ ఏరియా సేల్స్ ఆఫీసర్ తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేస్తున్నాడని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబురావు ఆరోపించారు. శనివారం ఆయన ముదినేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి చెందిన స్టీవెన్ బాబును డీలర్‌షిప్ నుంచి తప్పించేందుకే సేల్స్ ఆఫీసర్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వెంటనే స్టీవెన్ బాబు అతని తండ్రిపై సంస్థ అధికారి పెట్టిన తప్పుడు కేసులను ఉప సంహరించి, డీలర్ షిప్‌ను స్టీవెన్ బాబు పేరున కొనసాగించాలని, లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని బాబూరావు హెచ్చరించారు. మాలమహానాడు నాయకులు గరికిముక్కు రాజేష్, భూపతి సునీత, పళ్లెం ఏసుపాదం, చీలి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కలిదిండి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక పల్లిపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం అర్చకులు మామిళ్లపల్లి నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అంద్రాజు రాముడు, అంద్రాజు హనుమంతరావు, మోకా పెద్దిరాజు, కొల్లాటి నరసింహస్వామి, తిరుమాని శ్రీనివాసరావు, నాగిడి రాజు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. భారీ అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తిరుమాని గణపతి, అంద్రాజు సుబ్రహ్మణ్యం, తిరుమాని నరసింహస్వామి, ఎం.పెంటయ్య, కె.దుర్గా ప్రసాద్, ఎన్.వెంకన్నబాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఉద్దేశించి మాట్లాడుతున్న వక్త

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గురుపూజోత్సవం

ట్రిపుల్ ఐటీలో వేదిక ఏర్పాటుపై విమర్శలు

నూజివీడు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ శాక్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ నూజివీడు డివిజన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధనలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. నూజివీడు డివిజన్ ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. రెసిడెన్షియల్ విధానంలో ఇంజినీరింగ్ విద్యను అందించే ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు ఇవ్వడంపై పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటి వరకు ట్రిపుల్ ఐటీలో ఏ ప్రైవేట్ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వలేదు. అయితే ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవానికి అనుమతించటంపై పలు విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అందుబాటులోకి రాలేదు.

ముద్దాయిలకు ఉచిత న్యాయసేవ



ముద్దాయిలను ఉద్దేశించి మాట్లాడుతున్న కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గోపి

నూజివీడు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): క్షణికోద్రేకంలో వివిధ నేరాల్లో ముద్దాయిలుగా నిలిచిన వారు సత్‌ప్రవర్తనతో మెలిగి జనజీవన స్రవంతిలోకి రావాలని, కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.గోపి, సెక్రటరీ కేవీ కృష్ణయ్య అన్నారు. శనివారం నూజివీడు సబ్‌జైల్‌ను వారు సందర్శించారు. సబ్ జైల్లోని స్టోర్‌రూమ్‌ను పరిశీలించి అనంతరం ముద్దాయిలతో సమావేశం అయ్యారు. అవసరమైన వారికి ఉచిత న్యాయసేవ అందిస్తామని తెలిపారు. అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, జైల్ సూపరింటెండెంట్ జి.ప్రసాదరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, సెక్రటరీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి అమూల్యం



ఎంపీడీవో ఏసుబాబును సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు తదితరులు

ముసునూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి విలువైనదని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన అంటే తనకు ఎంతో ఇష్టమని ఖాళీ సమయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావలసిన కెరీర్ గైడెన్స్ అందిస్తానని తెలిపారు. అనంతరం మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మకిషోర్, గుడిమళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో ఏసుబాబును సన్మానించారు. హెచ్ఎం అల్లాభక్షు, నాయకులు కె.గాంగేయుడు, డి.బెనర్జీ, కె.రాజు, ఫ్రాన్సిస్, చిట్టిబాబు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శించిన చిన్నారులకు బహుమతులు

కైకలూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచండీమహాయాగసహిత శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా కూచిపూడి నృత్యం చేసిన చిన్నారులకు మానవత సేవా సంస్థ సభ్యులు బహుమతులు అందజేశారు. శుక్రవారం రాత్రి అమ్మవారి కళామండపం వద్ద చిన్నారులకు మానవత తరపున సర్టిఫికెట్లను, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. సంస్కృతి సంప్రదాయాలను మరింత ఇనుమడింపజేసేందుకు గుడివాడకు చెందిన శ్రీదత్తసాయి శ్రీశివాని కూచిపూడి నృత్యాలయం కృషి అభినందనీయమన్నారు. మానవత సభ్యులు వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, కనకదుర్గ, బోయిన సత్యసూర్యప్రభావతి, ఇమ్మడి పాండురంగ విఠల్, తలారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



కైకలూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు వాహన పూల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, ప్రజలు పెద్దఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు పైడిమర్రి రమేష్, గంగాధరరావు, బొగ్గవరపు శ్యామ్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వీజేఎస్ మాల్యాద్రి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

'లోన్ కట్టినా నగలు ఇవ్వడం లేదు'



వివరాలు చెబుతున్న బాధితుడు అబ్బదాసరి శ్రీను

నూజివీడు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్లో ఉన్న మణప్పురం గోల్డ్ లోన్ కంపెనీలో ఆగిరిపల్లికి చెందిన అబ్బదాసరి శ్రీను బంగారాన్ని కుదువపెట్టి రుణం తీసుకున్నాడు. అయితే రుణం చెల్లించి బంగారం ఇవ్వాలని, 20 రోజులుగా తిరుగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయాడు. తాను అడిగితే గతంలో పనిచేసిన సిబ్బంది బంగారం, డబ్బుతో వెళ్ళిపోయాడని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, సుమారు రూ.15 లక్షలు విలువ చేసే బంగారం మాయం అయిందని చెబుతున్నారని, తాకట్టుపెట్టిన బంగారం ఈ విధంగా పోతే తమ పరిస్థితి ఏమిటంటూ వాపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.



ఆధ్యాత్మికవేత్త భగవాన్‌దాస్‌కు సన్మానం

ముదినేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దేవపూడి రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ దాసరి భగవాన్ దాస్‌ను గ్రామస్థులు, మచిలీపట్నం మార్కెట్ యార్డు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం దేవపూడిలో భగవాన్ దాస్ దంపతులను సత్కరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో గత ఐదేళ్లుగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న భగవాన్ దాస్‌కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించి మెమెంటో అందజేశారు. ఆధ్యాత్మికవేత్త గడ్డం మల్లికార్జునరావు, సర్పంచ్ దాసరి కాశీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసాగర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉద్యోగ విరమణ సత్కారం

నూజివీడు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకులుగా విద్యాసాగర్ సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. విద్యాసాగర్ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని వ్యవసాయ సిబ్బంది, విత్తన, పురుగుమందుల దుకాణదారులు ఆయనను ఘనంగా సత్కరించారు. నూజివీడు డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పుష్పశయ్యాలంకరణ సేవ

ముదినేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవపూడిలోని విజయదుర్గాదేవిని శాంతాదేవిగా అలంకరించారు. ప్రవాసాంధ్రుడు పర్దీప్ శర్మ అలంకరణకు దాతగా వ్యవహరించారు. పుష్పశయ్యాలంకరణ కార్యక్రమాన్ని అర్చకుడు చావలి సత్యసాయిబాబు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దాసరి భగవాన్ దాస్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.